# తూర్పుగోదావరి ఏజెన్సీ గిరిజనులపై పోలీసు దమనకాండను ఆపాలి!

## ఎ.పి.సి.ఎల్.సి. నిజనిర్ధారణ కమిటీ డిమాండ్

తూర్పు గోదావరి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంత గ్రామాలలోని గిరిజనులపై పోలీసులు సాగించిన, సాగిస్తున్న పాశవికమైన దమనకాండపై ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం (ఎ.పి.సి.ఎల్.సి) నిజనిర్ధారణ కమిటీ జూన్ 4,5 తేదీలలో పరిశీలన జరిపింది. అనంతరం "నిజనిర్ధారణ కమిటీ నివేదిక"ను రాజమండ్రిలో ఎ.పి.సి.ఎల్.సి. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె. బాలగోపాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి, న్యాయవాది జె.కె. రాజులు పత్రికలకు విడుదల చేశారు. తక్షణం ఏజెన్సీలో పోలీసుల దమనకాండనాపాల్సిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ఆ నివేదికను ఈ దిగువనిస్తున్నాం - ఎడిటర్

మారేడు మిల్లి, రంపచోడవరం, అడ్డతీగల, వై.రామవరం, మండలాలలోని 14 గ్రామాల ప్రజలను నిజనిర్ధారణ కమిటీ కలిసి వివరంగా మాట్లాడింది. బాధితులంతా గిరిజనులే. కొండరెడ్డి, కొండదొర, వాల్మీకి, కొండ కమ్మరి తదితర ఆదివాసీ తెగలకు చెందినవారే. ఈ ప్రజానీకం నిత్యం పోలీసు దాడులకు గురి అవుతున్నారు. నక్సలైట్లకు అన్నం పెడుతున్నారనీ, వస్తువులు సరఫరా చేస్తున్నారనీ ఆశ్రయం ఇస్తున్నారనీ, కొరియర్లుగా పని చేస్తున్నారని పోలీసులు వీళ్ళమీద నింద మోపి కొడుతున్నారు. బూతులు తిడుతున్నారు. లాకప్పులో అమానుషంగా చిత్రహింసలు పెడుతున్నారు. కేసులలో ఇరికించి దూరాన ఉన్న రాజమండ్రి సెంట్రల్ జైలుకు పంపిస్తున్నారు.

నిరుపేదలయిన ఆదివాసీలని కూడా చూడకుండా పోలీసులు ఏజెన్సీ ప్రజానీకాన్ని ఈ విధంగా వేధిస్తుంటే కోర్టులు కూడా అందుకు తగినట్టు నెలల తరబడి బెయిలు ఇవ్వకుండా ఈ గిరిజనులు సమాజానికి చాలా అపాయకరమయిన నేరస్తులయినట్టు దీర్ఘకాలం నిష్కారణంగా రిమాండులో ఉంచుతున్నాయి.

గుర్రపు చొక్క గ్రామానికి చెందిన మడకం గోవిందును రంపచోడవరం పోలీస్ స్టేషన్ లో పెట్టిన హింసకు అతను ఇంకా లేవలేకుండా ఉన్నాడు. అతని కాలిపాదాలలో మేకులు దిగగొట్టి హింసించారు. 10 రోజులు పైగా అక్రమ నిర్బంధంలో పెట్టుకున్నారు. గుజ్జుమామిడివలసకు చెందిన కారగాని సువర్ణరావును రంప చోడవరంలో 6 దినాలు విపరీతంగా కొట్టి వదిలి పెట్టారు. అతని కాళ్ళు, చేతులు ఇప్పటికీ వాచి ఉన్నాయి. కొండవాడ సర్పంచ్ పులికాంత బాలయ్య ఆచూకీ చెప్పమంటూ అతని కొడుకులిద్దరినీ మారేడు మిల్లి పోలీస్ స్టేషన్ లో 18 రోజులు అక్రమంగా నిర్బంధించి కొట్టి ఏదో కేసులో ఇరికించి జైలుకు పంపించారు. కోర్టు వీళ్ళకు రెండు నెలలదాకా బెయిల్ ఇవ్వలేదు. పందిరిమామిడి కోటలో 11 మందిని 1 వారం నుండి 2 వారాలు దాకా మారేడు మిల్లి పోలీస్ స్టేషన్ లో అక్రమంగా నిర్బంధించి వారిలో రేవుల బాలిరెడ్డి, రేవుల సోమిరెడ్డిలను విపరీతంగా కొట్టారు. బాలిరెడ్డి కాలి చర్మం ఈ దెబ్బలకు చిట్లింది.

కూడూరు, పందిరి మామిడి కోట గ్రామాలలో మగవాళ్ళ ఆచూకీ చెప్పమంటూ స్త్రీలను బండ బూతులు తిడుతూ కొట్టారు. దేవరపల్లిలో ప్రగతిశీల మహిళా సంఘం(పి.ఓ.డబ్ల్యు) సభ్యురాలు సుబ్బలక్ష్మి ఆచూకీ చెప్పమని అంటూ ఆమె గురించి అసభ్యంగా మాట్లాడుతూ చాలామంది మగవాళ్ళను కొట్టారు.

పోలీసుల వేటుకు గురయినవాళ్ళలో ప్రజలు ఎన్నుకొన్న ప్రజా ప్రతినిధి కూడా ఉన్నారు. నున్నంపాడు గ్రామసర్పంచ్ బాల్ దొరను, నూరుపూడికి చెందిన సింగిల్ విండో డైరెక్టర్ ఎర్రన్న దొరను పోలీసులు కేసులో ఇరికించి జైలుపాలు చేయడమేకాక, వాళ్ళకు బెయిలు వచ్చిన తరువాత ఏజెన్సీలో కనబడితే కాల్చి పారేస్తామని బెదిరిస్తున్నారు. ఏజెన్సీలో పుట్టి పెరిగి ఏజెన్సీలో ప్రజా ప్రతినిధులయిన వారిని ఏజెన్సీలో కాలు పెట్టరాదని శాసించే అధికారం పోలీసులకు ఎక్కడిది? అసలు ఎవరినయినా సరే కాల్చి చంపుతాం అనే అధికారం పోలీసులకు ఎక్కడిది? పుల్లంగి సర్పంచ్ చిక్కుడు భీంరెడ్డిని కూడా పోలీసులు చాతీమీద తుపాకి పెట్టి బెదిరించి రైతు కూలీ సంఘానికి రాజీనామా చేయాలంటూ ఒక తెల్లకాగితం మీద సంతకం తీసుకున్నారు.

నక్సలైట్ దళం జాడ చూపించమంటూ పోలీసులు దేవరపల్లి, నూరుపూడి, చెరువులపాలెం, గ్రామాలకు చెందిన గిరిజనులను విపరీతంగా కొట్టి కళ్ళకు గంతలు కట్టి జీపులో ఎక్కించి ఒక రాత్రంతా అడవులలో తిప్పారు. వాళ్ళని కూడా కొట్టారు. వారిలో ఒకరయిన పల్లాల సన్యాసిరెడ్డిని నేలమీద వెల్లెలికిలా పడుకోబెట్టి అతని ఛాతీపైన అడ్డంగా ఒక గుండ్రని కర్రపెట్టి దానిపైన పోలీసులు ఎక్కి నిలబడి అతని శరీరం నిలువునా 'స్కేటింగ్' చేసారు. అడవిలో నక్సలైట్ల జాడ పోలీసులకు చూపించవలసిన డ్యూటీ గిరిజనులపైన ఏ చట్టం పెట్టింది?

గడచిన కొద్ది నెలలుగా జరుగుతున్న ఈ దాడులలో గిరిజనులను ఆం.ప్ర. రైతు కూలీ సంఘం నుండి రాజీనామా చేయమని పోలీసులు బలవంతం చేస్తున్నారు. బలవంతంగా రాజీనామా పత్రాలు రాయిస్తున్నారు. పోలీసులకు నేరాలు అరికట్టే అధికారం చట్టం ఇచ్చింది కానీ ప్రజల రాజకీయాలలో జోక్యం చేసుకొనే అధికారం ఎక్కడ ఇచ్చింది? ఈ రోజు రైతు కూలీ సంఘం కావచ్చు. రేపు తెలుగుదేశం పార్టీలో ఉన్న గిరిజనులు కూడా రాజీనామా చేసి కాంగ్రెస్ లో చేరాలని పోలీసులు బెదిరిస్తే?

'టాడా' చట్టాన్ని రాష్ట్రంలో దుర్వినియోగం చేయబోమనీ నిజంగా ఎవరి మీద పెట్టాలో వారి మీదే పెడతామనీ రాష్ట్ర డి.జి.పి. తరచుగా ప్రకటిస్తున్నారు. కానీ తూర్పు గోదావరి ఏజెన్సీని చూస్తే ఇది ఎంత అబద్ధమో అర్థం అవుతుంది. కొండరెడ్లు, కోయదొరలు టెర్రరిస్టులా? అందులో వయసు మళ్ళిన ముసలి గిరిజనులు ఈ జిల్లా పోలీసులకు టెర్రరిస్టులుగా కనిపిస్తున్నారా? ఈ మధ్య వై.రామవరం మండలంలోని చెవిటి దిబ్బలు, కడతల బంద గ్రామాలకు చెందిన నలుగురు గిరిజనులపైన టాడా కేసుపెట్టారు. వారిలో ఇద్దరు(కెచ్చెర ఆదినారాయణ, గేదెల సూర్యారావు) 60 సంగరాలు పై బడిన వారు. వీళ్ళను టెర్రరిస్టులంటే ఎవ్వరయినా నవ్వుతారు. కానీ పోలీసులు వీరిపైన 'టాడా' కేసు పెట్టడమేకాదు, జిల్లా కోర్టు కూడా నాలుగు నెలలు గడిచినా వీళ్ళకు బెయిలు ఇవ్వలేదంటే 'టాడా' చట్టం ఎంత ఘోరమయిన అణచివేత సాధనంగా పనిచేస్తున్నదో అర్థం అవుతుంది.

ఎక్కడో ఏదో ఒక సంఘటన జరిగితే దానిని పురస్కరించుకొని పోలీసులు ఈ విధమయిన దాడులకు పాల్పడుతున్నారు. మారేడు మిల్లి మండలం బంద గ్రామంలో జరిగిన చర్చికూల్చివేత అనే అవాంఛనీయమయిన సంఘటనను పురస్కరించుకొని ఆ గ్రామానికి 50 కిలోమీటర్ల దూరాన ఉన్న గ్రామాలలో కూడా పోలీసులు దాడులూ, అరెస్టులూ చేస్తున్నారు. 300 మంది ని ముద్దాయిలుగా చూపించి, ఇప్పటికి 60 మందిని 'గుర్తించారు'. మిగిలిన వాళ్ళకోసం వేటాడటం అనే పేరుమీద ఇంకెంత బీభత్సం చేస్తారో అని ఏజెన్సీలో గిరిజనులు భయపడుతున్నారు. అదే విధంగా అడ్డతీగల వై.రామవరం ప్రాంతంలో పీపుల్స్ వార్ దళాలు ఏదయినా పేల్చివేత లేక దహన కాండకు పాల్పడితే పరిసర గ్రామాల గిరిజనులను పోలీసులు చిత్రహింసల పాలు చేసి ఆ కేసులో ఇరికిస్తున్నారు.

గిరిజనులపైన పోలీసులు అమలు చేస్తున్న ఈ పాశవికమైన దమనకాండను వెంటనే ఆపాలని డిమాండ్ చేస్తున్నాం. గతకొద్ది మాసాలుగా జరిగిన, జరుగుతున్న ఘటనలపైన జిల్లా కలెక్టరు స్వయంగా విచారణ జరిపి పోలీసుల అక్రమాలపైన తగు చర్యలు తీసుకోవాలని ఎ.పి.సి.ఎల్.సి. డిమాండ్ చేస్తున్నది. ■